## క్లుప్తంగా

### సింహాచలేశుడికి ఘనంగా ఏకాదశి తిరువీధి



అప్పన్నకు ఏకాదశి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఘనంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో వేంజేపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో ఊరేగించారు. విశేషంగా హారతులు సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

### అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాత విశ్వనాథరాజుకు బాండ్ అందజేస్తున్న ఏఈవో, సూపరింటెండెంట్

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని కూర్మన్నపాలేనికి చెందిన భూపతిరాజు విశ్వనాథరాజు రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో రమణమూర్తి, ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సునీల్ బాండ్ అందించారు. ఆయనకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.

### దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



మండపం ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక యంగ్ మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరవాడ సంతబయలులో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దుర్గాదేవి మండపం ఏర్పాటుకు బుధవారం అసోసియేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు దంపతులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ నెల 22న అమ్మవారిని ప్రతిష్ఠించి 11 రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 2న అమ్మవారి అనుపు మహోత్సవం జరుపుతామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పైల రామచంద్రరావు, రొంగలి అప్పలనాయుడు, గండి ఈశ్వరరావు, పరవాడ జగదీశ్వరరావు, పైల అప్పలనాయుడు, గండి లోకేష్, చుక్క నమో, గండి చంద్రావు పాల్గొన్నారు.

### శరన్నవరాత్రులకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు, భక్తులు

పరవాడ : మండలంలోని భర్నికం గ్రామంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రుల నిర్వహణకు బుధవారం పందిరిరాట వేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొండా తాతారావు, రామలక్ష్మి, పెదిరెడ్ల శ్రీనివాసరావు, రాధ, పాకల నీలకంఠస్వామి, బొండా నరసింగరావు, పి.కనకమహాలక్ష్మి, ఇందల వరలక్ష్మి, బొండా నాని పాల్గొన్నారు.

### ఎర్రచిత్త నివారణకు సస్యరక్షణ చర్యలు



గొరపల్లిలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

పెందుర్తి: వరి పైరుకు పట్టిన సుడిదోమ (ఎర్రచిత్త) నివారణకు పూర్తి స్థాయి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు జి.మాణిక్యాంబిక సూచించారు. మండలంలోని గొరపల్లిలో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో యూరియా వాడకం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ ఎర్రచిత్త నివారణకు ఎసిఫేట్ రసాయనం 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి (ఎకరాకు 300 గ్రాములు) పిచికారీ చేయాలని సూచించారు. లేదా కార్బడ్ హైడ్రా క్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి (ఎకరాకు 400 గ్రాములు) పిచికారీ చేయాలని సూచించారు. రైతులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఏఈవో రమణ, వీఏఏ గాయత్రి పాల్గొన్నారు.

# చదును చెయ్.. పాగా వెయ్..!

- మండలంలోని జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్లపై కబ్జాదారుల కన్ను
- కూటమి ప్రభుత్వంలో నాయకుల అండతో విధ్వంసం
- లే అవుట్లు కొల్లగొట్టి.. అక్రమంగా గ్రావెల్ తరలింపు
- లే అవుట్లలో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాల కబ్జా
- 800 వరకూ ప్లాట్లు మాయం
- ఫిర్యాదులు చేస్తున్నా.. చోద్యం చూస్తున్న అధికారులు

**పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హౌసింగ్ లే అవుట్లు ఏర్పాటు చేసి గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా పట్టణ ప్రాంత ప్రజల కోసం సబ్బవరం మండలంలో పలు లే అవుట్లు వేసి గృహ నిర్మాణాలను శరవేగంగా చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వ నిర్ణయాలకు తూట్లు పొడిచింది. గ్రావెల్ అక్రమ తవ్వకాల ద్వారా మెగా లే అవుట్లలోని చాలా ప్లాట్లు ఆధారాలు లేకుండా గల్లంతయ్యాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన పైడివాడ అగ్రహారం లే అవుట్లలో 130 వరకూ ప్లాట్‌లు ఆనవాళ్లు కనిపించని పరిస్థితి. సామాజిక అవసరాల కోసం లే అవుట్లలో కేటాయించిన స్థలాలు సైతం కబ్జాకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికార యంత్రాంగం కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.** – సబ్బవరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సబ్బవరం మండలంలో 8 చోట్ల అర్బన్ హౌసింగ్ లే అవుట్లు అభివృద్ధి చేశారు. పెందుర్తి నియోజకవర్గంతోపాటు విశాఖ నగరానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇక్కడ ప్లాట్లు కేటాయించి.. 34,062 గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా పైడివాడ అగ్రహారంలో 9,252 గృహ నిర్మాణాలకు కేటాయించిన మెగా లే అవుట్‌ను గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యుత్, నీరు, రోడ్లు వంటి మౌలిక వసతులతో శరవేగంగా నిర్మాణాలు చేపట్టారు. గతేడాది ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలిచి అధికారం చేపట్టాక.. కొంత కాలం ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

**రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా**

ఇదే అదనుగా కూటమి నేతల అండతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోయింది. కొండలు, ప్రభుత్వ భూములతోపాటు జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్లలో విధ్వంసం సృష్టించారు. రోడ్లు, ప్లాట్లు అనే తేడా లేకుండా భారీ యంత్రాలతో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడటంతో కొన్ని లే అవుట్లు కాలనీల్లా కాకుండా గ్రావెల్ క్వారీలను తలపిస్తున్నాయి. మండలంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ లే అవుట్లలో రోడ్లు, విద్యుత్ లైన్లతోపాటు 800 వరకూ ప్లాట్లు గల్లంతయ్యాయి. దీనిపై రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ తాతయ్యబాబు సబ్బవరం మండలంలోని పలు లే అవుట్లను గతంలో పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత లే అవుట్లలో గ్రావెల్ అక్రమ తవ్వకాల ద్వారా సృష్టించిన విధ్వంసానికి అవాక్కయ్యారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో లెక్కలపై ఆరా తీసి 800 వరకూ ప్లాట్లు గల్లంతైనట్లు గుర్తించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తోపాటు మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా.. నేటికీ ఏ సమాచారం లేదు.

**పట్టించుకునే నాథుడేడి..?**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అర్బన్ హౌసింగ్ మెగా లే అవుట్‌ను మండలంలోని పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడు పాలెం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేశారు. సుమారు 328 ఎకరాల్లోని లే అవుట్‌లో 10 వేల ప్లాట్లు వేసి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ లే అవుట్‌లో పార్కులు, ఆట స్థలం, తాగునీటి ట్యాంకులు, సామాజిక మరుగుదొడ్లు, పాఠశాలలు, దేవాలయాలు వంటి సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడు. అర్బన్ హౌసింగ్ లే అవుట్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలనూ అక్రమార్కులు చదును చేసి ప్లాట్లుగా విభజించి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. వీటిపై రెవెన్యూ, పట్టణ గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పైడివాడ అగ్రహారంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన హౌసింగ్ మెగా లే అవుట్



లే అవుట్లలోని స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న మండల వాసి నవనీత్ వర్మ



ఫెన్సింగ్ వేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులు(ఫైల్)



అసకపల్లి హౌసింగ్ లే అవుట్

**మండలంలో లే అవుట్ల వివరాలు**

| | |
|---|---|
| అర్బన్ హౌసింగ్ లే అవుట్లు | - 8 |
| లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు వేసిన ప్లాట్లు | - 34,062 |
| లే అవుట్లలో గల్లంతైన ప్లాట్లు | - 800 |

**లే అవుట్ల వారీగా ప్లాట్లు**

| | | |
|---|---|---|
| పైడివాడ అగ్రహారం | - | 9,252 |
| గొల్లలపాలెం-1 | - | 1,192 |
| గొల్లలపాలెం-2 | - | 5,132 |
| గొల్లలపాలెం-3 | - | 812 |
| గంగవరం | - | 6,820 |
| నంగినారపాడు | - | 8,120 |
| గాలిభీమవరం | - | 1,892 |
| అసకపల్లి | - | 842 |

### ఫిర్యాదులపై అధికారుల చర్యలు శూన్యం



పైడివాడ అగ్రహారంలో ఏర్పాటు చేసిన మెగా లే అవుట్‌లో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాన్ని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ప్లాట్‌గా విభజించి దర్జాగా ఫెన్సింగ్ వేసి కబ్జాకు పాల్పడ్డారు. దీనిపై రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా పరిశీలనలతో సరిపెడుతున్నారు. అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో సబ్బవరం తహసీల్దార్‌తోపాటు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. వారు చర్యలు చేపట్టకపోవడంతో ఇటీవల వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్‌లకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాం.

– ఎం.ఎస్.నవనీత్ వర్మ, ఎరుకునాయుడుపాలెం, సబ్బవరం మండలం

## నేస్తాలమ్మ పండగ నేడు



పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం ప్రజల ఆరాధ్యదైవం నేస్తాలమ్మ అమ్మవారి పండగ గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయం వద్దకు చేరుకుని పసుపు కుంకుమ సమర్పించుకుంటారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయం వద్ద షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, మజ్జిగ సదుపాయాలు కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రికి వాడచీపురుపల్లిలోని సతకంపట్టు నుంచి అమ్మవారిని డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, చిడతలు, కోలాటాల నడుమ ఊరేగిస్తారు. అనంతరం అనుపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

## బోరు ఏర్పాటు చేయాలని ఆందోళన



పరవాడ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఐద్వా సంఘు మహిళలు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం టిడ్కో కాలనీ వాసులకు మంచినీటి అవసరాలు తీర్చడానికి చేతి బోర్లు ఏర్పాటు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు పరవాడ సచివాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ కాలనీ వాసులకు జీవీఎంసీ సరఫరా చేస్తున్న నీరు బురదగా రావడంతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సమస్యను ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు ప్రయోజనం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి టిడ్కో కాలనీలో చేతి బోరు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మాణిక్యం డిమాండ్ చేశారు. ఆందోళనలో ఐద్వా మహిళ సంఘ ప్రతినిధులు బంగారమ్మ, అన్నపూర్ణ, సీత, లక్ష్మి, సరోజిని, రమణమ్మ పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ సంతోషం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి



వైద్య పరీక్షలు చేయించుకుని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

పరవాడ: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ హైమావతి అన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్‌కు పరీక్షలు జరిపి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న బాలికలకు డాక్టర్ దేవికిశోర్ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రశాంతి, రంజిత్, శ్రావణ్, పద్మజ, కనక అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

**గుల్లేపల్లి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు**

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు డాక్టర్ డి.దమయంతి, డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి, డాక్టర్ కుసుమ కుమారి, ఎంపీహెచ్‌వో ఆర్ఎం నాయుడు, బండారు శ్రీను, కోంప నర్సింగరావు, వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వారధి జిల్లా స్థాయి పోటీలు



వ్యాసరచన, డిబేట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, ఎంసీహెచ్ స్కూల్‌లో బుధవారం వారధి జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ప్రతి మండలం నుంచి ఆయా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మొత్తం 22 టీమ్‌లు జిల్లా స్థాయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. డిబేట్‌లో నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సుహాని గీతికం గుల్షన్ ఫిర్దాస్, ఉజ్వల గెలుపొందారు. గైడ్‌గా ఎన్ఆర్ఆర్ఎస్ నరసింహం వ్యవహరించారు. వ్యాసరచనలో గాజువాక ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీవల్లి, తనూజ, సాయి పూజిత గెలిచారు. నిర్మల టీచర్ గైడ్‌గా వ్యవహరించారు. విజేతలకు పాఠశాల హెచ్ఎం రాధాకుమారి అధ్యక్షత జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథి సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్ చేతుల బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి విజేతలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, ఏఎంఓ జి.లక్ష్మి పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



కోట్ని నాయుడుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని వంగలి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కోట్ని నాయుడుని మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం పరామర్శించారు. విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పార్టీ నేతలతో కలిసి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయుకుడు గవర రాజు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్ కుమార్, ఉగ్గిన నాగార్జున తదితరులు పరామర్శించారు.

## గ్రామీణ జీవన ప్రతిబింబం జానపద సాహిత్యం



ప్రసంగిస్తున్న కవి రెడ్డి రామకృష్ణ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'జానపద గేయాలు, సామాజిక అంశాలు' అనే అంశంపై కవి రెడ్డి రామకృష్ణ ప్రసంగించారు. జానపద గేయాల్లో ఆర్థిక, సామాజిక అంశాలు అనేకమున్నాయన్నారు. మహిళ, పురుష సంబంధాలు.. ముఖ్యంగా ఆస్తి సంబంధాల విషయంలో ఒకనాటి సమాజం ఎలా ఉండేదో చెబుతాయన్నారు. అద్భుతమైన సాహిత్య విలువలతో వచ్చిన జానపద గేయాలు, సాహిత్యం నేటికీ అవసరమేనని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఒకనాటి గ్రామీణ జీవనం, చరిత్రను తెలుసుకోవడానికి జానపద సాహిత్యం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిహెచ్.చిన సూర్యనారాయణ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, భాగవతుల సత్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, ఎం.పరమేశ్వరరావు, పిళ్లా శివాజీ, గుంటూరు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల విజేత విశాఖ మహిళా కళాశాల



విజేత జట్టు సభ్యులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణలో భాగంగా కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విజేతగా సీహెచ్ ఊర్మిలా అండ్ టీం నిలిచింది. రన్నరప్‌గా డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన సీహెచ్ భాగ్యశ్రీ అండ్ టీం గెలిచింది. మూడవ స్థానంలో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వి.లావణ్య అండ్ టీం నిలిచింది. పోటీలు ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ కబడ్డీ వంటి సాంప్రదాయ ఆటలు మన సంస్కృతిని ప్రతిబింబించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్‌లో ఉన్నత స్థాయి పోటీలకు మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఉపాధ్యాయులు, సిబ్బంది, స్పోర్ట్స్ టీం సభ్యులు తదితరులు పాల్గొంది.

## రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పెందుర్తి : ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ఆ పార్టీ నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, అనకాపల్లి జిల్లా పార్టీ కార్యదర్శి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. చిక్కాల సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పరవాడలో కంటి వైద్య శిబిరం**

పరవాడ : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకుడు కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో అనిత ఆప్టికల్స్, విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు జరిపి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. బొడ్డు కోటిబాబు, బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి



అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు



పూజ చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు వేపగుంట సమీపంలోని బ్రహ్మం గారి మఠంలో విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని పూజలు చేశారు. పార్టీ నాయకులు రాపర్తి మాధవరావు, కాళ్ల గంగాధర్, దాడి అర్జున్, బొడ్డేటి జగదిఅప్పారావు, బొడ్డపల్లి హేమంత్, ఉగ్గిన నాగార్జున, జతిన్, సాయిరాం పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

## విద్యార్థుల భాగస్వామ్యంతోనే ప్రగతి



మై భారత్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: మై భారత్ కార్యకలాపాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి విజ్ఞప్తి చేశారు. వికాస్ దినోత్సవం సందర్భంగా మై భారత్, సమసరియా ఫౌండేషన్ సంయుక్తంగా కాలేజీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎ. అర్చన మాట్లాడుతూ మై భారత్ వికాస్ దివస్ వేడుకలు కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత ఆర్. లీలా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం ఉందన్నారు. స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంస్కరణలు, జాతీయ అంతర్జాతీయ సంబంధాల గురించి వివరించారు. కార్యక్రమం అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మై భారత్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.